## క్లుప్తంగా

### లింగాకర్షక బుట్టలతో పురుగుల నివారణ



పంపిణీకి సిద్ధం చేస్తున్న పళ్లాలు, బుట్టలు

**మాకవరపాలెం:** లింగాకర్షక బుట్టలతో పురుగులను నివారించవచ్చని ప్రకృతి సేద్య విభాగం మండల ఇన్‌చార్జి కవిత అన్నారు. ప్రకృతి సేద్య పద్ధతిలో వరిసాగు చేసే రైతులకు పసుపు పళ్లాలతోపాటు లింగాకర్షక బుట్టలు పంపిణీకి సిద్ధం చేశారు. వీటిని కొండలఅగ్రహారంలో శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. వరి పంటలో పసుపు పళ్లాలు, లింగాకర్షక బుట్టలను ఉంచడం వల్ల పురుగుల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. పసుపు పళ్లాలకు ఉండే జిగురుకు దోమలు, పురుగులు అంటుకుని మరణిస్తాయన్నారు. వీటిని అన్ని గ్రామాల్లో ప్రకృతి సేద్యం చేసే రైతులకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది సుదర్శన్, అప్పారావు పాల్గొన్నారు.

### నేడు మెట్టపాలెం వార్డు మెంబరు ఉప ఎన్నిక

**నర్సీపట్నం:** మెట్టపాలెం పంచాయతీలో రెండో వార్డు మెంబరు ఉప ఎన్నిక శనివారం నిర్వహించనున్నారు. మొత్తం 186 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో బండారు రాంబాబు, టీడీపీ మద్దతుతో పైల కొండబాబు పోటీ చేస్తున్నారు. ఈ ఎన్నికకు అవసరమైన ఏర్పాట్లు చేశామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.వి.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఓటర్లు తమ ఓటు హక్కును ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినియోగించుకోవచ్చనని తెలిపారు.

### నేడు రోడ్డు పనులకు శంకుస్థాపన

**బుచ్చెయ్యపేట:** మండలంలో కేబీ రోడ్డు నుంచి పెదమదీన వెళ్లే రోడ్డు పనులకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ శనివారం శంకుస్థాపన చేస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు తెలిపారు. ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కృషి మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజాం వెదుళ్లగెడ్డ జంక్షన్ నుంచి ఉప్పరగూడెం, పెదమదీన, గున్నెంపూడి వరకు బీటీరోడ్డు నిర్మాణానికి రూ.1.83 కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి పార్టీ నాయకులు పాల్గొనాలన్నారు.

### సర్పంచ్‌గా లక్ష్మి బాధ్యతల స్వీకరణ

**బుచ్చెయ్యపేట:** స్థానిక సర్పంచ్‌గా సుంకరి లక్ష్మి బాధ్యతలు స్వీకరించింది. ఇక్కడ సర్పంచ్ సుంకరి సూరిబాబు ట్రాక్టర్ ప్రమాదంలో ఏడాది క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. ఉప ఎన్నికల్లో భాగంగా మండల, గ్రామ నాయకులు పోటీ లేకుండా మృతుడు భార్య లక్ష్మికి సర్పంచ్ పదవి అప్పగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. నామినేషన్ ఆమె ఒక్కరే వేయగా, ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ధ్రువీకరించారు. శుక్రవారం ఆమె పలువురు నాయకుల సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించింది.

### అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ భేష్



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మీనాకుమారి

**మాడుగుల:** సత్యవరం అంగన్‌వాడీ కేంద్రం -1 నిర్వహణ బాగుందని ఎంపీడీవో మీనాకుమారి కితాబిచ్చారు. శుక్రవారం ఆమె ఇక్కడ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు ఏర్పాటు చేయడంతోపాటు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశాలక్ష్మి, మహిళా పోలీసు నూకరత్నం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అచ్యుత్, అంగన్వాడీ కార్యకర్త జయమ్మ, ఆయా రాజేశ్వరి పాల్గొన్నారు.

### నేత్రపర్వంగా సుదర్శన హోమం

**అనకాపల్లిటౌన్:** మండలంలోని రాజుపాలెం దరి లలితాదేవి పీఠంలో శుక్రవారం శ్రావణమాస పూజలు నేత్రపర్వంగా జరిగాయి. వేద పండితులు, వాస్తు సిద్ధాంతి ఎం.రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీకమలం పుష్పాలతో పూజ, సుదర్శన హోమాన్ని శ్రీశైల దేవస్థానం చండీ ఉపాసకులు షణ్ముఖశర్మ నిర్వహించారు. దంపతులచే పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తులు హాజరయ్యారు.



# ప్రశ్నార్థకంగా వరిసాగు

- వర్షాభావంతో ఎండిపోతున్న వరి నారుమడులు
- సంరక్షించుకోవాలని ఏవో విజయలక్ష్మి సూచన



ఎండిపోతున్న వరి నారుమడి



వరినాట్లు వేసిన పొలంలో చుక్క నీరు లేక దిగాలుగా చూస్తున్న మహిళా రైతు

**రోలుగుంట:** మండలంలో ఖరీఫ్ వరిసాగు ప్రశ్నార్థకంగా మారింది. కొన్ని చోట్ల వరినాట్లు వేసిన పొలంలో తడులు లేక ఎండిపోతోంది. మరికొన్ని చోట్ల నాట్లు వేయకుండానే వరినారు వడిలిపోతోంది. అధిక శాతం దమ్ములు సైతం చేయలేని దుస్థితిలో వరుణుడి కటాక్షం కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది మండల రైతులకు కావాల్సిన వరి విత్తనాలను రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం సమకూర్చింది. రాయితీపై 672 క్వింటాళ్ల అన్ని రకాల విత్తనాలను సకాలంలోనే సరఫరా చేసింది. పెట్టుబడులకు రైతు భరోసా సాయం సైతం అందించింది. ఈ మేరకు గత నెలలో అనుకూల వాతావరణంతో ఆకుపోత పనులు జోరుగానే సాగాయి. ఆకు ఏపుగా ఎదగడంతో సాగునీటి వసతి ఉన్నటువంటి శరభవరం, బుచ్చింపేట, కొమరవోలు ఆవకింద రైతులు దమ్ములు చేసుకుని వరినాట్లు వేసుకున్నారు. ఈ నెల మొదటి వారంలో మోస్తరు కురిసిన వర్షాలకు కొంతమంది తమ భూముల్లో నీరు ఒడ్డుకుని రోలుగుంట, కంచుగుమల తదితర గ్రామాల్లో వడివడిగా దమ్ములు చేసుకుని నాట్లు వేసుకున్నారు. తర్వాత అనుకూల వర్షాలు కురవక, సాగునీటి ఆధారం లేక ఎండిపోతున్నాయి. కొండపాలెం, వెలంకాయలపాలెం, రోలుగుంట అడ్డసరం, కొంతలం తదితర గ్రామాల్లో దమ్ములు చేయక, నాట్లు వేయకముందే ఎండిపోయాయి. దీంతో రైతులు ఏం చేయాలో తెలియక వరుణుడి కటాక్షం కోసం ఎదురు చూస్తున్నారు. అసలే ఈ మండలం వర్షాధారం కావడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### క్షేత్రస్థాయిలో సందర్శించి సలహాలు

ఖరీఫ్‌లో 1,286 హెక్టార్లలో వరి సాగు లక్ష్యంగా పెట్టుకున్నాం. వర్షాభావ పరిస్థితులతో ఇప్పటి వరకు 480 హెక్టార్లలోనే నాట్లు పడ్డాయి. సచివాలయ పరిధిలోని గ్రామస్థాయి వ్యవసాయాధికారులతో కలసి వరినాట్లు వేసిన పొలాలను క్షేత్రస్థాయిలో సందర్శించి అవసరమైన సలహాలు, సూచనలు చేస్తున్నాం. ఎండుపోతున్న వరినాట్లు, నారుమడుల్లో 13-04-45, 15-15-15, 19-19-19 5 గ్రాముల లీటరు నీటిలో మిశ్రమం చేసి పిచికారీ చేసి సంరక్షించుకోవాలి.

– ఎస్.విజయలక్ష్మి, ఏవో, రోలుగుంట

## పారదర్శకంగా ఇంటింటా ఓటరు సర్వే



కె.కోటపాడులో ఓటరు సర్వేను పరిశీలిస్తున్న నాగలక్ష్మి



ఎం.బెన్నవరంలో ఇంటింటా సర్వే పరిశీలిస్తున్న తహసీల్దార్ .శ్రీనివాస్‌నాయుడు

**కె.కోటపాడు:** ఇంటింటా ఓటరు సర్వే కార్యక్రమాన్ని బీఎల్వోలు పారదర్శకంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి తెలిపారు. కె.కోటపాడు, చౌడువాడ గ్రామాల్లో ఇంటింటా ఓటరు సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన, డబుల్ ఎంట్రీ ఓట్లును ఆయా కుటుంబాల వారికి సమాచారం అందించి వారి అంగీకారంతో తొలగించాలని సూచించారు. ఈ నెల 21వ తేదీలోపు కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. ఓటరు సర్వే సూపర్‌వైజర్ రామచంద్రమూర్తి, పంచాయతీ కార్యదర్శి వి.ప్రసాద్ పాల్గొన్నారు.

**ఓటరు సర్వేలో నిర్లక్ష్యం చేస్తే చర్యలు**

**నాతవరం:** ఇంటింటా ఓటరు సర్వే శత శాతం పూర్తి చేయని బీఎల్వోలపై కలెక్టరు శాఖాపరమైన చర్యలు తీసుకుంటారని తహసీల్దార్ ఎస్.ఎస్.వి.శ్రీనివాస్‌నాయుడు హెచ్చరించారు. ఆయన శుక్రవారం ఓటరు సర్వే శాతం తక్కువగా నమోదైన గ్రామాల్లో పర్యటించారు. సాయంత్రం ఎంపీడీవో కార్యాలయంలో 65 పోలింగ్ బూత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల వారీగా సర్వే చేసిన ఓటర్ల జాబితాలో వివరాలపై బీఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. మిగిలినవి ఎన్నికలు కమిషనర్ ఇచ్చిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఆదివారం సైతం సర్వే చేయాలన్నారు. వలంటీర్లను, రాజకీయ నాయకులను వెంట తీసుకెళ్తే ఎన్నికలు కమిషన్ చర్యలకు బాధ్యుల వుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో హనుమంతరావు, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

### 33కేవీ లైన్లో చెట్ల కొమ్మలు తొలగింపు

**గొలుగొండ:** నర్సీపట్నం-గొలుగొండ మార్గంలో 33 కేవీ లైన్ పరిధిలోని చెట్ల కొమ్మల తొలగింపు పనులు శుక్రవారం విద్యుత్ శాఖ సిబ్బంది నిర్వహించారు. ఈ మార్గంలో విద్యుత్ లైన్ల కింద చెట్లు, మొక్కలు అధికంగా ఉండటం వల్ల తరుచూ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. దాంతో కొన్ని చోట్ల క్రేన్ సహాయంతో మరికొన్ని చోట్ల కూలీలతో చెట్ల కొమ్మలు తొలగించి విద్యుత్ సరఫరాలో సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.

### రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

వాహనాలను తనిఖీ చేసిన ఎస్‌ఐ రామకృష్ణ



వాహన తనిఖీలను చేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణ

**కె.కోటపాడు:** వాహనదారులు ప్రయాణ సమయాల్లో రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రయాణాలు చేయాలని ఎ.కోడూరు ఎస్‌ఐ బి.రామకృష్ణ తెలిపారు. వారాడ- ఎ.కోడూరు మార్గంలో శుక్రవారం ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి అపరాధరుసుం విధించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. కారులు, జీపుల్లో నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

## భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



దుర్గాదేవి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



తిమిరాం శివాలయంలో ఉమామహేశ్వరి

**రావికమతం:** శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా కొత్తకోట, రావికమతం, సాయినగర్ గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచే అమ్మవారి దర్శనానికి క్యూకట్టారు. ఆయా ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, క్షీరాభిషేకాలు నిర్వహించారు.

**దేవరాపల్లి:** మండల వ్యాప్తంగా శ్రావణ శుక్రవారం పూజలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రావణ వరలక్ష్మీదేవికి సంప్రదాయంగా పలు రకాల పండ్లు, పిండివంటలు నైవేద్యంగా సమర్పించి నియమ నిష్టలతో పూజించారు. ఆలయాల్లో సైతం ప్రత్యేక పూజలు చేశారు. తిమిరాం ఉమామహేశ్వరి ఆలయంలో స్థానిక ఆలయ పురోహితుడు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

### డిప్యూటీ తహసీల్దార్‌గా అరుణ్ చంద్ర



డిప్యూటీ తహసీల్దార్ అరుణ్ చంద్ర

**బుచ్చెయ్యపేట:** మండల డిప్యూటీ తహసీల్దార్‌గా అరుణ్ చంద్ర శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న మురళి మూణ్నెల్ల క్రితం రావికమతం తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఇక్కడ తహసీల్దార్ కార్యాలయంలో పనులు పెండింగ్‌లో ఉన్నాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీకి పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని కలెక్టర్ రవి పటాన్‌శెట్టి దృష్టికి విప్ తీసుకెళ్లారు. దాంతో అనకాపల్లి కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న అరుణ్ చంద్రను బుచ్చెయ్యపేట డీటీగా నియమించడంతో ఆయన విధుల్లో చేరారు.

## చివరి దశకు చేరుకున్న వరినాట్లు



జి.కొత్తపల్లి వద్ద పూర్తయిన వరినాట్లు

**చీడికాడ:** కోనాం జలాశయం ఆయకట్టు పరిధిలో వరినాట్లు దాదాపుగా పూర్తయ్యాయి. జలాశయం ఆయకట్టు 14,500 ఎకరాలు, ఇందులో హైలెవల్ పరిధిలో నాలుగు వేల ఎకరాలు ఆయకట్టు ఉంది. మిగిలిన ఆయకట్టు ఐదు మండలాలకు సంబంధించి దిగువ కాలువ పరిధిలో ఉంది. మండలంలోని వరిసాగు 4,500 హెక్టార్లు, ఇప్పటి వరకు నాలుగు వేల హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయి. అర్జునగిరి, చుక్కపల్లి, చీడిపల్లి, తదితర మెట్ట గ్రామాల్లో వర్షాధార భూముల్లో నాట్లు పడాల్సి ఉంది. ప్రస్తుతం జలాశయం నీటిమట్టం 95.80 మీటర్ల వద్ద ఉంది. ఎగువ కాలువల ద్వారా 30 క్యూసెక్కులు, దిగువ కాలువల ద్వారా 150 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. గతేడాది కంటే ఈ ఏడాది ఈ నెలలో నీటిమట్టం 3 మీటర్లు తక్కువగా ఉంది. దీంతో రైతుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు కురుస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు.

## పాఠశాలకు తీరిన మురుగు సమస్య



కాలువలో పూడిక తీస్తున్న పొక్లెయిన్

**చోడవరం:** విద్యార్థుల సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. గాంధీ గ్రామంలోని అంకుపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆనుకున్న మురుగు కాలువలో చాలా కాలంగా పూడిక తీయకపోవడంతో మురుగు బయటకు వెళ్లక దుర్వాసన వెలువడేది. దాంతో విద్యార్థులు చాలా ఇబ్బంది పడేవారు. ఈ సమస్యను గ్రామ సర్పంచ్ గాడి అప్పారావు దృష్టికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ప్రతినిధులు తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి పొక్లెయిన్‌తో కాలువలో పేరుకుపోయిన పూడిక తీయించారు. కాలువ శుభ్రం చేయడంతోపాటు మురుగు దిగువ మెయిన్ కాలువలోకి వెళ్లేందుకు మార్గం ఏర్పడింది. ఈ సమస్య పరిష్కారం కావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

### యోగా పోటీలో దైవజ్ఞ ప్రతిభ

**కశింకోట:** జాతీయ స్థాయి యోగా పోటీలో స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌కి చెందిన విద్యార్థి ఎం.దైవజ్ఞ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ రూపానంది శుక్రవారం తెలిపారు. ఇటీవల బెంగళూరులోని శివజ్యోతి యోగా కేంద్రం ఆధ్వర్యంలో బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్ నేషనల్ ఓపెన్ యోగా ఆన్‌లైన్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరిగాయి. ఈ పోటీలో తమ స్కూల్‌కు చెందిన 2వ తరగతి విద్యార్థి దైవజ్ఞ 8 ఏళ్ల లోపు విభాగంలో మూడో స్థానంలో నిలిచి జ్ఞాపిక, సర్టిఫికెట్ పొందిందన్నారు. విజేతను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



లేగదూడ యజమాని రాజుబాబుకు బహుమతి అందజేస్తున్న పశు సంవర్థక శాఖ జేడీ ప్రసాదరావు

**రోలుగుంట:** పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో రొంగలపాలెం పంచాయతీలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఇక్కడ కుసుర్లపూడి, నూకందరపాలెం, తదితర గ్రామాల నుంచి 36 లేగదూడలను రైతులు తీసుకొచ్చి ప్రదర్శించారు. వీటిని అనకాపల్లి జిల్లా పశు సంవర్థక శాఖాధికారి ప్రసాదరావు, జిల్లా పశు గణాభివృద్ధి సంఘం కార్యనిర్వహణాధికారి డాక్టర్ రామ్మోహన్‌రావు, రోలుగుంట, కుసుర్లపూడి పశువైద్యులు నూకేశ్వరరావు, పైల సురేష్ పరిశీలించి పరిపుష్టి కలిగిన మూడు లేగ దూడలను ఎంపిక చేశారు. వాటిలో ప్రథమ స్థానం దుంగల రాజుబాబు, ద్వితీయస్థానం రొంగల ముత్యాలు, తృతీయ స్థానంగా వేగి వెంకటరమణ దూడలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పశువైద్యులు ఆధునిక యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పశు పోషణ, వాటి ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు.

## భూసర్వేలో 750 మంది రైతులకు పాస్‌పుస్తకాలు

తహసీల్దార్ రమేష్‌బాబు



కొరువాడ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

**కె.కోటపాడు:** కొరువాడలో నిర్వహించిన జగనన్న శాశ్వత భూహక్కు- భూసర్వేలో 750 మంది రైతులకు త్వరలోనే పాస్ పుస్తకాల మంజూరు కానున్నట్లు తహసీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. భూసర్వే కార్యక్రమం చివరి దశకు చేరుకోవడంతో గ్రామ రైతులతో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో సుదీర్ఘకాలంగా నెలకొన్న భూసమస్యలకు భూసర్వే ద్వారా తీరనున్నట్లు తెలిపారు. గ్రామ రెవెన్యూలోని 900 ఎకరాల్లో సర్వే చేశామన్నారు. ఆయా భూముల యజమానులకు పాస్ పుస్తకాలను అందించనున్నట్లు తెలిపారు. వీటిపై ఎటువంటి సమస్యలున్నా గ్రామ రెవెన్యూ అధికారి దృష్టికి తీసుకు రావాలని సూచించారు. ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, సర్పంచ్ సింగంపల్లి నారాయణ మూర్తి, గ్రామ రెవెన్యూ అధికారి పోతల శంకరరావు పాల్గొన్నారు.

## అభ్యసన సామర్థ్యం పెంపొందించేలా బోధన

వారాడ, మల్లంపాలెం పాఠశాలల్లో ఎంఈవో ప్రసాద్ తనిఖీ



వారాడలో విద్యార్థి విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో ప్రసాద్

**కె.కోటపాడు:** విద్యార్థులకు అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేలా బోధించాలని ఎంఈవో డీపీడీ ప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో వారాడ, మల్లంపాలెం ప్రాథమిక పాఠశాలలను శుక్రవారం ఆయన తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు పాఠశాలల్లో ఇప్పటి వరకూ విద్యార్థులకు బోధన, పాఠ్యాంశాల ప్రణాళికను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో రక్తహీనత సమస్య లేకుండా చూడాలని తెలిపారు. ఇందుకు సంబంధించి వైద్య సిబ్బందితో హిమోగ్లోబిన్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు ఇవ్వాలని తెలిపారు. రక్తహీనత సమస్యను అధిగమించేందుకు ఆకుకూరలతో కూడిన ఆహారం తినాలని అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మల్లంపాలెం పాఠశాల హెచ్‌ఎం శాంతి, ఉపాధ్యాయిని కొండ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య



మాట్లాడుతున్న నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, పక్కన ఇన్‌చార్జి ఎస్‌ఐ రామారావు

**నాతవరం:** రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించామని నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మండలంలో ప్రధాన సమస్యలను ఇన్‌చార్జి ఎస్‌ఐ రామారావును అడిగి తెలుసుకున్నారు. తాండవ ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేశారని, సాగు నీటి కోసం కాలువల వద్ద రైతులు తగాదాలు పడే అవకాశముందని, ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో బాధ్యతగా వ్యవహరించాలని, స్పందన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తుని - నర్సీపట్నం రోడ్డుపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారించామన్నారు. యువత మద్యం సేవించి నడపడం, బైక్‌పై ముగ్గురేసి ప్రయాణించడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఈ నేపథ్యంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు ప్రధాన కూడలి, బ్యాంకులు, బంగారు దుకాణాలు, జన సంచారం అధికంగా ఉండే ప్రదేశాల్లో సీసీకెమెరాలు ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గ్రామాల్లో పండగులకు, సాంస్కృతిక కార్యక్రమాలకు విధిగా పోలీసులు అనుమతి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు.

## జేడీపేటలో లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వీఎల్ఎస్‌వో సత్యం తదితరులు



పశువులను పరీక్షిస్తున్న పశువైద్యాధికారి ప్రియాంక, చిత్రంలో సర్పంచ్ సూరినాయుడు

**మాడుగుల:** జేడీపేటలో పశువులకు వ్యాపించే అతి ప్రమాదకరమైన లంపీస్కిన్ వ్యాధికి నిరోధక టీకాలు వేశామని ఏడీ వి.చిట్టినాయుడు శుక్రవారం తెలిపారు. 60 పశువులు ఉచితంగా టీకాలు వేశామన్నారు. పశువుల చర్మంపై బుడిపెలు వచ్చినట్లయితే వెంటనే పశువైద్యాధికారులను సంప్రదించాలని జేడీపేట వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి సత్యం రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి, వైఎస్సార్ సంచార రథం 1962 సిబ్బంది పాల్గొన్నారు.

**200 పశువులకు లంపీస్కిన్ టీకాలు**

**దేవరాపల్లి:** పాడి రైతులంతా తమ పశువులకు లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి వేయించుకోవాలని మామిడిపల్లి సర్పంచ్ కర్రి సూరినాయుడు కోరారు. శుక్రవారం మామిడిపల్లిలో పశు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో మామిడిపల్లి పశువైద్యాధికారి జి. ప్రియాంక వైద్య సేవలందించారు. 200 ఆవులు, ఎద్దులకు లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. 18 పశువులకు గర్భకోశ, చూడి నిర్ధారణ తనిఖీలు చేశారు. 23 పశువులకు సాధారణ ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. పశువులకు అత్యవసర పరిస్థితుల్లో 1962 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక పశువైద్యాధికారి గణేష్, పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రికార్డుల్లో సమాచారం సమగ్రంగా ఉండాలి



బుచ్చింపేట పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో జాను ప్రసాద్

**రోలుగుంట:** పాఠశాల నిర్వహణ రికార్డులు సమగ్ర సమాచారంతో ఉండాలని ఎంఈవో-1 పి.జాను ప్రసాద్ ఆదేశించారు. బుచ్చింపేట ఎంపీపీ పాఠశాలలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల ఆధారంగా విద్యార్థుల హాజరు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం అమలు, మెనూ, పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులు నాగభూషణం, కృష్ణారావులకు సూచించారు.

## బాక్సింగ్ క్రీడాకారులకు రక్షణ మ్యాట్లు వితరణ



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నారాయణరావు, సంయక్ సాధిమా

**నర్సీపట్నం:** పట్టణ వ్యాపారి, సామాజిక కార్యకర్త వెలగా నారాయణరావు తనయుడు సుధీర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బాక్సింగ్ క్రీడాకారులకు రూ.50 వేలు విలువ చేసే రక్షణ మేట్లను పంపిణీ చేశారు. బాక్సింగ్, స్కేటింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు అర్జున్ స్కేటింగ్ అసోసియేషన్ డైరెక్టర్ సంయక్ సాధిమా బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో నింజాస్ అకాడమీ డైరెక్టర్ బోళెం శివ, ఫౌండర్ అబ్బు, కోచ్‌లు శేఖర్, ప్రియాంక పాల్గొన్నారు.